# పరాధీన

కోడికూసి చాలా సేపయింది, యాభై ఏళ్ళ ఓ ఏతానికి సాక్ష్యంగా నిల్చొనున్న చింత చెట్టు మీద కాకులు 'కావ్ కావ్' మని అరుస్తున్నాయి. తుమ్మ చెట్టు మీదున్న పిచ్చుకలు "కీచ్ కీచ్" మంటున్నాయి. రామశాస్త్రి స్నానాదులు ముగించి ప్రాతఃకాల మంత్రాలు పఠిస్తున్నాడు కాలకృత్యాలు తీర్చుకోవడానికై పల్లె జనాలు కంచుముంతలు, చెంబులు చేతుల్లో పట్టుకొని బహిర్భూమికి వెళ్ళి తిరిగి వస్తున్నారు. స్త్రీలు వాకిల్లూడుస్తుంటే లేచిన దుమ్ము పొరలు ఊర్నిండా వున్నాయి పశువుల తలుగులు విప్పి ఊరిబయటకు తోలుకెల్తున్నాడు. జీవన సమరంలో పాల్గొనడానికి ఊరు మేల్కొంటుంది. సాలె నర్సయ్య మగ్గంనేస్తున్న చప్పుడు లయబద్ధంగా వినబడుతుంది. తూర్పు చీకట్లను చీల్చుకొని కర్మసాక్షి బయటకొస్తున్నాడు. అప్పుడే విచ్చుకుంటున్న ముద్ద మందారంలా వున్న నర్సయ్య కూతురు మల్లవ్వ నేసిన ఒళ్ళే(చిన్నచీర) కట్టుకొని మొక్కి చీపురుతో వాకిలూడుస్తుంది. ఉదయించే సూర్య బింబంలా అప్పుడే జీవితంలోకి (ప్రవేశిస్తున్న) మల్లవ్వకు కోర్కెలంటూ అప్పుడే మొదలవుతున్నాయి. ఆమె కళ్ళ ముందు పట్వారీ పంతులు కూతురు కట్టుకున్న పీతాంబరం కదులుతుంది ధగధగ మెరిసే జరీతో పసుపుపచ్చ రంగులో వున్న ఆ పట్టుచీరనామె మర్చిపోలేకపోతుంది.. ఊడుస్తూ మధ్య మధ్య ఆగిపోతుంది. ఆమెకు చేస్తున్న పనిపై మనసుపోవడం లేదు. ఎప్పుడూ అమ్మా-నాన్నలు తనకు నాన్న నేచినా చీరలే కట్టుకోవడానికిస్తారు ... మంచి బట్టలనే కొనరు. ఈసారి దసరా పండుగకైనా నాన్ననలాంటి చీర కొనమనాలి. తనకా చీరుంటే ఎంత బాగుంటుంది? తనలో తానను కుంటూనే పరద్యానంగా వాకిలూడుస్తుంది. దొడ్డికిపోయి తిరిగి వచ్చిన రాజమ్మ కూతురిలా వాకిలూడ్వడం పూర్తి చేయకపోవడం చూసి ది ...

రెండు మూడు రోజులుగా పరధ్యానంగా వుంటున్న కూతురు కేమైంతో రాజమ్మకు తెలియడం లేదు.

"మల్లవ్వా! వాకిలూడ్సుడింక కాలేదా? నేను ముంత పట్టుక (దొడ్డికి) పోక ముందు మొదలుపెట్టినవు ఏంజేస్తున్నవే ఇంత సేపు,,? ముంతను అరుగుమీద పెడుతూ అంది రాజమ్మ.

'ఏం లేదే అవ్వ ఏం లేదు. ఐపోతుంది...'' అని గబగబా వాకిలూడ్చింది. మట్టికుండలో నీళ్లు చేది పెండ కలిపి అలుకు చల్లింది. ముగ్గేసి ఇంట్లోకొస్తున్న కూతురుతో అంది రాజమ్మ.

"ఏందో చెప్పలేవు బిడ్డ. రెండు మూడు రోజుల్నుంచెట్లనో ఉన్నవు"

మల్లవ్వకు తన కోర్కె గూర్చి తల్లికి చెప్పాలనే వుంది...కాని ధైర్యం చాలడం లేదు ఎందుకంటే తన కోర్కె శక్తికి మించిందని ఆమెకు తెలుసు. మగ్గంనేస్తూ బ్రతికే నాన్న తనకు పీతాంబరం కొనడం కాని పననీ తెలుసు. అయినా అమ్మకు చెప్పి లాభమేముంది—? కొనేది నాన్న అందువల్ల తల్లికా విషయం చెప్పలేదు మల్లవ్వ.

"నాకేం గాలేదు మంచిగనే ఉన్ననే అవ్వ" అంటూ ముఖం కడుక్కోవడానికి పొయ్యి బొగ్గు తీసుకొని తోముకుంటూ బావి దగ్గరికెళ్ళింది. ముఖం కడుక్కొని కండెలు చుట్టే పనిలో మునిగిపోయింది. పదిగంటల సమయ మయ్యే సరికి వంట పనులన్ని ముగించి స్నానం చేసచ్చి అన్నం తిను బిడ్డ నాయినకు సీకు పెడతా,, అంది రాజమ్మ కూతురుతో. లేచి స్నానం చేసి మరో ఒళ్ళే కట్టుకుంది మల్లవ్వ. అన్నం తినడానికింట్లోకెళ్ళింది. తండ్రి కూతుళ్ళకు మొక్కజొన్న గడుకన్నం కంచు తలెల్లో వడ్డించింది రాజమ్మ. వాళ్ళు తింటుంటే చూస్తూ కూర్చుంది... కూతురు వరద్యానానికి గల కారణం భర్తముందే అడగాలనుకొని.

"నీకేమయింది బిడ్డ పానం మంచిగ లేదా,,? అంది రాజమ్మ.

చెబితే ఆర్చేవాళ్ళా—తీర్చేవాళ్ళా? తనలో తాననుకొని ...

"ఏం లేదు బాగానే వున్న" అంది మల్లవ్వ.

"మాతోం జెప్పకుంటే ఎవ్వరితో సెప్పుతవు బిడ్డ? చెప్పు" అన్నాడు నర్సయ్య....

తన కోర్కె గొంతెమ్మ కోర్కెనని తెలిసినా తండ్రితో చెబితే ఎప్పటికైనా కొనకపోతాడా అని చెప్పడానికే నిశ్చయించుకుంది.మల్లవ్వ "నాకు దసరకు పట్టువారి పంతులు బిడ్డ కట్టుకున్న చీరసోంటి పీతాంబరం గావాలె..." అని తలవంచుకొని అన్నం తింటుంది మల్లవ్వ.

బిడ్డ కోర్కె వాళ్ళకు వింతగా అన్పించింది. కొంచెం సేపెవరూ మాట్లాడలేదు ..

"నువ్వు చిన్న పిల్లవు. నీకు మన శక్తేందో తెలువది మీనాన్న మొగ్గం నేస్తుంటే పొట్ట గడుసుడే కష్టమయితంది. మనకు పీతాంబరాలేన్నుంచి వస్తయి చెప్పు? నాకు నలుబయేదేండ్లచ్చినయి, ఒక్కసారి గూడ నేతచీర తప్ప వేరే కట్టుకోలే. మనకున్న దాంతోనే ఒడ్డెక్కచ్చు కోవలె'' అంది రాజమ్మ కూతురు తల నిమురుతూ.

మల్లవ్వ ముఖం చిన్నబోయింది.

"మల్లవ్వా! రెక్కల కిష్టంతోని బతికే మనకు పట్టుజీర లెట్లస్తయి బిడ్డ? ఒక్క పీతాంబరానికి పెట్టే పైకంతోని పది నేతచీరలు కొనచ్చు. అవ్వి రెండేండ్లదాకా కట్టుకుంటానికయితాయి. నీకీ పండుగకు వాయిల్ చీరను కొంట తియ్య" అన్నాడు నర్సయ్య.

పరిస్థితులు, బాధ్యతలు వయసును మించిన పెద్దరికాన్ని నేర్పినా మల్లవ్వ పసి మనస్సు కోర్కె మానుకోలేక పోయింది.

"లేదు. నాకొక్క పీతాంబరం గావలె— మల్లెప్పుడడుగ".

ఎప్పుడూ ఏ కోర్కె కోరని మల్లవ్వ కుండలగలది తిని వెళ్ళదీసుకునే కూతురు పట్టుచీర గూర్చి పట్టుపట్టడం ఆశ్చర్యంగా వుందా తల్లి దండ్రులకు. కొద్ది సెపాలోచించినట్టు చేశాడు నర్సయ్య.

''ఈ దసర పండుగకు కొనుడుగాదు, వైశాఖ మాసంల నీ లగ్గం పెట్టుకుంటం ..అప్పుడు నేనన్న కొంట. మీ అత్తగారితోనన్న కొనిస్త సరేనా బిడ్డ" అన్నడు మూతి కడుక్కుంటూ నర్సయ్య.

పెళ్ళనేసరికి సిగ్గుపడింది మల్లవ్వ.

"గింత చిన్నప్పుడే నాకు లగ్గమెందుకు''? అంది లేచి నిల్చుంటూ.

''నువ్వింక చిన్నపిల్లవనుకుంటున్నవా బిడ్డ? పన్నెండేండ్లస్తున్నయి నాకయితే ఆరేండ్లకే పెళ్ళయింది లగ్గంల పీతాంబరం కొంటనన్నడు గదా మీనాన్న, ఇగ రంది పెట్టకోకు . అంది వాళ్ళ తిన్న గిన్నెలు తీస్తూ రాజమ్మ అప్పటి వరకు కొన్నా మంచిదేనని సరిపెట్టకుంది మల్లవ్వ.

మధ్యాహ్న సమయం. దాదాపు సగం పొద్దు గడిచిపోయింది సూర్యుడు నడినెత్తిమీదికొచ్చి వంగుతున్నాడు. జీవన పోరాటం సాగిస్తున్న జనాలు తమతమ పనుల్లో నిమగ్నమయ్యారు. మల్లవ్వ కిప్పుడు సగం వయస్సు దాటుతుంది. తలలో అక్కడక్కడ తెల్లవెంట్రుకలగుపడుతున్నాయి. కొడుకు బడికెళ్ళాడు. కూతురు కూలి పనికెళ్ళింది ఇంటి పనులన్నీ ముగించుకొని నమారు నేయడానికి దారాలు సరిచేస్తూ భర్తకొరకెదురు చూస్తుంది. మరికొద్ది సేపట్లో సెమటలు కక్కుతూవచ్చి వాకిట్లో సైకిలాపాడు రంగయ్య "అబ్బ ఎండ మండిపోతుంది. ఆకలి దంచేస్తుంది'' అంటూ భుజమ్మీదున్న పంచెతో చెమటతుడుచుకున్నాడు. సైకిల్ పైనుంచి బట్టలముళ్ళే దించి ఇంట్లో పెట్టాడు.

"అన్నం బెట్టుపో నేను స్నానం చేసొస్తా'' మల్లవ్వకు చెప్పి బావి దగ్గర కెళ్ళాడు. భర్త స్నానం చేసొచ్చే సరికి పీటవేసి తెల్లగిన్నెలో నూకల బియ్యపన్నం వడ్డించింది మల్లవ్వ.

''నువ్వింకా అన్నం తిననట్టున్నవుగద. నువ్వు గూడ పెట్టుకో".. అన్నాడు రంగయ్య పప్పుతో అన్నం కలుపుకుంటూ.

"నువ్వు తిన్నంక తింట తియ్యి'' అంది మల్లవ్వ భర్త దగ్గరగా కూర్చొని.

"ఇంత పొద్దెక్కేదాకెందుకున్నావు.. బట్టలమ్మకు రాను పొరుగూరికి పోయిన నాకోసం ఎదురు చూసుడెందుకు? ఎన్నిసార్లు చెప్పినా వినవు నీ మొకమెంతీడ్సుకపోయిందో చూడు. అన్నం బెట్టుకో'' భార్యను బలవంతం చేసాడు రంగయ్య.

ఇక తప్పదని తెల్లగిన్నెలో తానూ అన్నంబెట్టుకుంది మల్లవ్వ.

"బట్టలేపాటమ్మినయి"? భర్త నడిగింది బుక్క నోట్లో పెట్టుకుంటూ.

రంగయ్య ముఖంలో విచారం... ..

"మబ్బుల్లేసిపోయి ఇంత సేపటాక్రిక మూడూర్లు తిరిగితే ఐదు చీర లమ్మినయి" అన్నాడు రంగయ్య.

"దసర పండుగ ముంగిట గూడ గంత తక్కువమ్మినయా? సరె తియ్య ఏం జేసేదుంది ఊళ్ళపొంటి తిరిగెటోళ్ళు బాగయిండ్రు," అంది మల్లవ్వ.

మాట్లాడుకుంటూ అన్నం తినడం ముగించారు వాళ్లు. రంగయ్య లేచి పోయి అరుగుమీదా వాల్చున్న నులక మంచంలో కూర్చున్నాడు. తిన్న గిన్నెలు తీసి బావిదగ్గర పెట్టొచ్చింది మల్లవ్వ. భర్త తలదిక్కు అరుగు మీద కూర్చుంది. శ్రీ కృష్ణ బీడి తీసి ముట్టించాడు రంగయ్య. బీడి పొగ ముక్కులోకి పోయి దగ్గింది అదిచూసి నవ్వాడు రంగయ్య.

"ఏందేమొ నవ్వుతున్నవు. ఏం గనిపించింది?" అంది మల్లవ్వ

''నీ ముక్కుకు పెద్దపోగు, చెవులకు గంటీలు. కాళ్ళకు వెండి కడియాలు చేతికి బంగారు కడెం నీకేం తక్కువోయ్. మస్తు నగలున్నాయి. ముక్కుపోగెట్లూగుతుందో చూడు" పరిహాసమాడాడు రంగయ్య.

''అబ్బో జోరుదారుగానే మురుస్తున్నవేంది? ఏడువారాలా నగలు దిగేసిన్నని సంబర పడుతున్నావా? అంది మల్లవ్వ.

ఆ మాటలకు నవ్వసాగాడు రంగయ్య. మొక్క బీడి పారేసాడు....

"ఉన్నవాటితోని సంతోష పడనోళ్ళయ్. ఇవ్వి గూడ లేనోళ్లెంత మందున్నరు?

"సంతోషపడకుంటే నిన్నేమన్న ఉరుకులాడిత్తినా? లగ్గమయిన కాన్నుంచడుగుతున్న పీతాంబర చీర కొంట కొంటానని మురిపించుడే దని కొన్నది లేపాయే. దసర పండుగకని కొన్నొద్దులు, మురిపిత్తివి, అవెనుక పిల్లల పురుల్లకంటివి. ఇప్పుడిక వాళ్ళ పెండ్లిళ్ళకంటావు... ఎటన్న పోదామంటే ఒక్క పట్టుచీర లేకపాయే... అందరికున్నయి" అంది మల్లవ్వ.

"నువ్వింకా చీర గూర్చి మర్చిపోలేదా?"

"లగ్గంల మా నాయిన్న కెల్లక కొనియ్యకపాయే మీ నాయిన్నను కొనుమంటే మీరిచ్చే కట్నమంతా గొట్టినా పీతాంబరం రాదన్నారుట. మా నాయిన్నతోని. నీ చేతులకు పెద్దెరికమచ్చినంక నన్న కొంటవను కుంటే వాయిదాలే పడేకాని కొనుడయితె లేకపాయె. ఈ దసరకన్న కొంటావా కొనవా?

"నాకు మాత్రం నీకు కొనాలని లేదావోయ్ కాని ఏంజేయాలోచెప్పు" పొద్దంతా తిరిగమ్మినా ఐదారు చీరలన్న అమ్ముత లేపాయే. వాట్లొచ్చె లాభంల నుంచే షావుకారి దగ్గర తెచ్చిన పైసలకు వడ్డిగట్టనాయె ఇల్లు గడవన్నాయె. మనకు పట్టుచీర లెట్లొస్తయి చెప్పు"

"ఇంటి పేరు కస్తూరోళ్ళు—ఇంట్లో గబ్బిలాల వాసనన్నట్టు నువ్వుచీసే దేమొ బట్టల బ్యారం. నాకో చీర కావన్నంటే కొనుడు కష్టం"

"బట్టలమ్ముతన్న నిజమే కాని అవి కొనుటానికి పెట్టుబడి మనదికాదు వడ్డిగిట్టదు. కొంచెం ఆలస్యమయితే షావుకారి మనిషి మీద మనిషిని తోలుడు నీకు తెలువదా? నేనమ్మే బట్టలల్లదోటి తీసి కట్టుకో. వద్దంటే మాట్లాడు. కాని పీతాంబరాలంటెట్లనోయ్?"

"అటువంటప్పుడు కొంట కొంటానని మురిపించుడెందుకు"

"నువ్వంత ఇష్టంగ అడుగుతు ఉే కాదన్లేక అంటున్నాను కాని నాతోని పట్టుచీర కొనుడయితదా చెప్పు? మనమిషుడు కొడుకుం జదివి య్యాలే. బిడ్డ పెండ్ల కెదుగుతు ది. ఇప్పుడు మనం చూడాల్సింది మన గురించి కాదు మన పిల్లల గురించి కొడుకు చదువుకొని పైకొస్తే మన కష్టాలు తీరుతాయి. అప్పుడు పట్టుచీరలయిన ఏ చీరలయిన కొనుక్కో వచ్చు."

„అంతే నాకు ప్రాప్తం లేందేన్నంచొస్తుంది? మీరు బాధపడకుండ్రి„ అంది మల్లవ్వ లేచి నిల్చుంటూ ...

"నువ్వింక పట్టుచీర గురించడుగకు, పెల్లి తే నేను తప్పకుండతెస్త" భార్య నోదార్చాడు రంగయ్య.

„ఎంత జేసినా ఏది మాన్కలన్నట్టుంది మన బతుకు. ఇగ నువ్వు పట్టుచీరలేం కొంటావు తియ్యి„? అని నమారు పనిచేయడానికెళ్ళి ది.

ఇద్దరూ పనిలో నిమగ్నమయ్యారు.

మల్లవ్వ ముఖం చిన్నబుచ్చుకొనుంది.

„నేను మా కొంట కాని మొఖం మాడ్సుకోనుడెందుకు - నాతోని గాకున్నా నా కొడుకుతో నన్న కొనిపిస్త...„

„అప్పటాల్రిక నేం బతుకుంట? ఆచీర గట్టుకుంట...„ వ్యంగ్యంగా అంది.

„బతుకకుంట జేత్తవోయ్. నేం జెప్పుతన్న గద ... నువ్వు చచ్చే దాక బతుకుతవు ...„ నవ్వుతూ అన్నాడు రంగయ్య.

„పెద్ద సంగతే కనిపెట్టినవు...„ నవ్వింది మల్లవ్వ.

ఊళ్లోకొస్తున్న పశువుల గిట్టగ చప్పుడు లయబద్ధంగా వినబడు తుంది....వాటి కాళ్ళ స్పర్శతో లేచిన దుమ్ము అలలు అలలుగా పోతుంది. పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి. పొద్దంత పన్లోకెళ్ళిన జనాలు ఇండ్ల

కొస్తున్నారు. పొద్దు గూట్లో పడబోతుంది. ఐదున్నర దశాబ్దాల వయసును మోస్తున్న మల్లవ్వ శరీరం విశ్రాంతి తీసుకోబోయే సూర్యునిలా వుంది. ముగ్గు బుట్టలా వున్న తలను గోక్కుంటూ పొయ్యంటు పెట్టడానికి సతమతమవుతుంది మల్లవ్వ. ఉఫ్ ఉఫ్ అని గొట్టంతో పొయ్యూదుతుంది. ఎంతకూ పొయ్యంటుకోవడం లేదు. పిడుకలను పగులగొట్టి పొయ్యిలో వేసి వాటిపై కిరోసిన్ పోసింది. కష్టపడి పొయ్యంటు పెట్టింది. కొద్ది సేపట్లో మసూర్ బియ్యపన్నం వంచింది. కోడిమాంసం వండింది. మల్లవ్వకీ రోజు ఎంతో సంతోషంగా ఉంది. రెండు రోజుల్లో దసరా పండుగుంది. పట్నంలో మంచి ఉద్యోగం చేస్తున్న కొడుకీరోజు కోడలుతో కలిసి వస్తున్నందుకు ఆనందంగా వుంది. పండుగకింటి కొస్తున్న కొడుకును గూర్చి ఆనంద పడుడూ వంటపని ముగించింది. కొడుక్కోసం అరుగుమీద కూచోచి ఎదురు చూస్తుంది.

„పొద్దు గూకింది, కొడుకింకా రాలేదేంటి ? తనలో తాననుకుంది.

వంగుకుంటూ ఇంట్లో కొచ్చిన రంగయ్యతో....

"బస్సింకా రాలేదా. మన శీనేడి? అంది మల్లవ్వ.

''ఇంక రాలే బస్సు...చూసి చూసి యాష్టకచ్చి వస్తున్న" అన్నాడు రంగయ్య

''బిడ్డం దోలుమంటె మాకే పిల్లలయినంక ఇంక తోలు దెందుకనే అల్లుడు. వీడన్న వస్తడా? రాడా, పండుగకు.. ''

,''ఎందుకు రాడోయ్ ఈ బస్సు కస్తనని కారట్రాసే బస్సింకా రాకనే పాయె. తొందర పడుత వెందుకు..?

''రోజు పొద్దు గూకంగనే వచ్చేదిగద. ఇయ్యాల్ల రాత్రియినా వస్త లేదేంది? సరేగనీ అన్నం తింటావా? అంది మల్లవ్వ.

"ఆకలయితుంది పెట్టు" అని కాళ్ళు కడుక్కోవడాని కెళ్ళాడు రంగయ్య.

స్టీలు గిన్నెలో భర్తకన్నం వడ్డించింది మల్లవ్వ. వేడి వేడికోడి

కూరను ప్లేట్లో వేసింది.

"నువ్వు కూడ తిన్లేవోయ్, బస్సెప్పుడస్తదో ఏమో,, అన్నం కలుపు కుంటూ అన్నాడు రంగయ్య.

"కొడుకు కోడలు రానియ్యి వాళ్లు తిన్నాంక తింట,,

రంగయ్య భోజనం చెయ్యడం పూర్తి చేసేసరికి శ్రీనివాస్, భార్యా పిల్లలతో ఇంట్లోకొచ్చాడు నిద్రపోతున్న పిల్లలను మంచంలో వేశారు. కొడుకును దగ్గరకు తీసుకుంది మల్లవ్వ. కుశల ప్రశ్నలడిగింది

''ప్రయాణం మంచిగయిందా బిడ్డ,,? కోడల్నడిగింది.

మూతి ముడుచుకుని ముబావంగా సమాధానం చెప్పింది కోడలు.

''కాళ్లు చేతులు కడుక్కొచ్చుకో పొండ్రి రాత్రయింది .. అన్నం తిందురు. పిల్లలు తింటరా? లేపుతరా?" అంది మల్లవ్వ.

''వాళ్ళిప్పుడు తినరు...టిఫిన్లనీ తినిపించిన.. అన్నాడు శ్రీనివాస్ పాంటు. షర్టు విప్పి లుంగీ కట్టుకున్నాడు. టవల్ బుజంపై వేసుకుని బావి దగ్గరకెళ్ళాడు అతని వెనుకనే సరళ కూడా వెళ్ళింది. ఇద్దరూ కాళ్ళే చేతులు ముఖం కడుక్కొని వచ్చాడు...

ఇద్దరి కన్నం వడ్డించింది మల్లవ్వ. దగ్గర కూర్చుంది కడుపు నిండా తినమంది. వాళ్ళు తిన్న తర్వాత తను కూడా తింది

శ్రీనివాస్ తండ్రి పడుకున్న మంచం పట్టెపై కూర్చున్నాడు .. కోడలు అరుగుమీద నేలపై కూర్చుంది. మల్లవ్వ వాళ్ళకు కొంత దూరముగ గోడకొరిగి కూర్చుంది. కరెంటు వెలుతురు డిమ్‌గా వుంది.

తండ్రి కొడుకులు కొంత సేపు మాట్లాడుకున్నారు.

"సరళా! సూటు కేసులున్న కొత్త బట్టలు తీసుకురాపో. బార్యతో అన్నాడు శ్రీనివాస్.

సరళ లేచి లోపలికెళ్ళి బట్టలు తెచ్చి భర్తకిచ్చింది.

"నాన్న! ఇవి నీకు" అని కొత్త ధోవతుల జోడా, లాల్చీ తండ్రి

చేతుల్లో పెట్టాడు శ్రీనివాస్.

"ఇది చెల్లెకు అది పండుగ కొస్తుందనుకున్న...." అని చీర దీసి పందంపై పెట్టాడు.

"అమ్మా! ఇది నీ చీర,, అని మల్లవ్వ చేతిలో చీర పెట్టాడు.

ఆ చీరను చూచిన మల్లవ్వ ముఖం వాచిపోయింది. తనకు కొడుకు తప్పకుండా పట్టుచీర తెస్తాడనుకున్న మల్లవ్వకు తీరనిఆశాభంగ మైంది. డిమ్‌గా వున్న ఆ మసక వెలుతురులో ఆమె ముకాన్నెవరూ గమనించలేదుకాని ఆమె కనుకొనల్లో కన్నీటి బొట్లున్నాయి.

తాను సిగ్గు విడచి కొడుకును పట్టుచీర తెమ్మని చాలా సార్లంది. భర్త కూడా పీతాంబరం తెమ్మని కొడుక్కు చెప్పాడు. ప్రతిసారి దాట వేసిన కొడుకు ఈ సారి తప్పకుండా తెస్తానన్నాడు. తన చిరకాల వాంచ తీరబోతుందన్నందుకెంతో ఆనందంగా వున్న మల్లవ్వకా చీరను చూడ గానే దుఃఖమొచ్చింది. వచ్చే కన్నీళ్ళను బలవంతంగా ఆపుకుంది... కొంచెం సేపా చీరనలాగే చూసి...

"పీతాంబరం తెస్తానంటివి కాదా బిడ్డ"? అంది మల్లవ్వ.

''తెస్తాననుకున్నాను. కాని జీతం సరిపోలేదే అమ్మ. ఫెస్టివల్‌కి జీతం డబ్బుతో సరళకో పట్టుచీర, నాకో డ్రెస్, నీకు, చెల్లికి. నాన్నకు పిల్ల లకు బట్టలు కొనేసరికి ఇంకో మూడొందలు బాకే అయింది. తర్వాతెప్పు డన్న మా కొంట తియ్యి'' అన్నాడు శ్రీనివాస్.

"ఇగెప్పుడు? నేను బొందకు పోయినంకనా"? తనలో తాననుకుంది.

''కోడలుకు యాడాదికో పట్టుచీర కొంటూనే వుంటివి గాదు బిడ్డ నాకొక్కటి తెస్తే ఏంబాయె. అనొద్దనుకుంటూనే అంది మల్లవ్వ.

ఆ మాటలకు గయ్ మని లేచింది సరళ.

''ఎప్పుడు నా చీరల మీదనే కన్ను నీకు. ఈ వయసులో నీకు పీతాం బరాలు గావన్నా? ఏ వయసుల సంబరం ఆ వయసుల దీరాలె. ముస

లొల్లి పట్టు చీరలు కట్టుకుంటేట్లుంటుంది?,, అంది కోపంగా.

మల్లవ్వ ముఖం మరింత నల్లబడింది. కనుకొలుకుల్నుంచి రాల డానికి సిద్ధంగా వున్న నీళ్ళను కొంగుతో తుడుచుకుంది.

"సరళన్నది నిజమేనే అమ్మ. ఈ వృద్ధాప్యంలో నీకు పీతాంబరా లెందుకు చెప్పు? అయినా నేను తేనంటలేను. వీలయినప్పుడు మా తెస్తా,, భార్యకు మద్ధతుగా అన్నాడు శ్రీనివాస్.

"అవును బిడ్డ. నువ్వన్నది నిజమే. ఊరు పొమ్మంటుంది...కాడు రమ్మంటుంది. నాకెందుకు పట్టుచీర? పిచ్చిదాన్ని తెలువకడిగిన, ఈ చీరే మంచిగుంది. అని అ చీర తీసుకొని ఇంట్లోకెళ్ళింది మల్లవ్వ

కొడుకు, కోడలుకు, పిల్లలకు ఇంట్లో మంచాలు సర్ధింది వాళ్ళను పడుకొమ్మని తాను భర్త మంచం ప్రక్కన అరుగు మీద నేలపై బట్ట లేసుకొని పడుకుంది.

చీకటి...చీకటి కన్ను పొడుచుకున్నా కన్పించని కటిక చీకటి అర్ధరాత్రి దాటుతోంది. ఊరంతా నిశ్శబ్దంగా నిద్రపోతుంది. కీచురాళ్ళ ధ్వని తప్ప మరే ధ్వని వినబడటం లేదు. దూరంగా కుక్కలు శోకాలు పెట్టి ఏడుస్తున్నాయి.. వేపచెట్టుమీద గుడ్లగూబ అప్పుడప్పుడు ఏడు స్తుంది—ఏడు దశాబ్దాల వృద్ధాప్యంతో వున్న పండు ముదుసలి మల్లవ్వ శాశ్వత నిద్రలోకి పోవడానికి సిద్ధంగావుంది—మనుమలు, మనుమరాళ్లు మునిమనుమలు, ముని మనుమరాళ్ళను చూచిన మల్లవ్వ నుల్క మంచ ములో మూల్గుతుంది ఆమె చుట్టూ ఆమెతో అరవై ఏళ్ళుగా జీవితం పంచుకొని బ్రతుకుతున్న రంగయ్య కూతురు, అల్లుడు, వాళ్ళపిల్లలు బంధువులు. చుట్టుప్రక్కలవాళ్లు బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త వృద్ధాప్యంలో కొడుకు ఆమెకు చదువు రాకున్నా ఏ గ్రంథాలు తిరిగేయ కున్నా, జీవితం నేర్పిన పాటాలతో స్త్రీ బ్రతుకెంత పరాదీనమో అర్ధం చేసుకుంది మూడు తరాల్లోనూ తన స్వల్పమైన కోరెను తీర్చుకో లేని స్త్రీ ఈ లోకంలోంచి శాశ్వతంగా సెలవు తీసుకోబోతుంది—.